# అమ్మ ఇష్టం

''పోస్ట్''

అప్పుడే పనిముగించుకుని కాస్సేపు నడుం వాలుద్దామని బెడ్‌రూమ్ వైపు నడుస్తోన్న రుక్మిణి పోస్ట్‌మాన్ కేక విని హాల్లోకి వచ్చింది. కిందపడిన మూడు కవర్లు తీసుకుని తిరిగి బెడ్‌రూమ్‌వైపు నడిచింది.

'' ఎక్కడినించో!'' ఆలోచిస్తూ ఓ కవర్ చింపింది.

''అమ్మా!''

నేనూ, ఆయనా పండక్కి వస్తున్నాం. నిన్నూ, నాన్ననూ చూడాలని ఉంది.

ఆవిడకి మిగతా అక్షరాలు కన్పించలేదు. ఆనందంతో మనసు పొంగిపోయింది.

సరిగ్గా సంవత్సరం కావస్తోంది. పెళ్ళికాగానే భర్తతో బెంగుళూరు వెళ్ళిపోయింది సురేఖ. మళ్ళీ పండక్కి వస్తోంది. సంక్రాంతికి రమ్మని, ఉగాదికి రమ్మని ఎన్ని లెటర్స్ రాసినా, ''మా ఇద్దరికీ లీవ్ దొరకదమ్మా!'' అని దాటేసింది.

రెండో కవర్ చింపింది.

''డాడీ!

నేనూ, మీ కోడలూ దీపావళికి వస్తున్నాం. నాకిష్టమైన రవ్వలడ్లు, కొబ్బరి హల్వా చేయమని అమ్మకి చెప్పండి.''

చిరునవ్వుతో పెదవులు విచ్చుకొన్నాయి.

చపాతీలు తప్ప మరేం దొరకవని, బొంబాయి వెళ్ళిన దగ్గర్నించీ

రుచికరమైన వంటలకి మొహం వాచిపోయానని ఉత్తరాలు రాసేవాడు చరణ్.

సురేఖ పెళ్ళికి కూడా భార్యాభర్తలిద్దరూ ఒక్క రోజు వచ్చి వెళ్ళారు లీవ్ లేదంటూ. వీళ్ళకీ ఇప్పుడే రావాలనిపించిందా? అంతకన్నా తనకేం కావాలి! పవన్ కూడా వస్తే, రెండేళ్ళుగా తను పడిన తపన, ఒక్క పండక్కైనా పిల్లలు ముగ్గురితో గడపాలన్న కోరికా తీరతాయి.

మూడో కవర్ చింపింది.

ఆవిడ ఆశ ఫలింపచేస్తూ భార్యాసమేతంగా వస్తున్నట్లు! పవన్ ఉత్తరం.

ఈ మధ్య చాలాకాలంగా ఆవిడని ఆవరించిన నిర్లిప్తత, నీరసం, దిగులు ఒక్కసారిగా రెక్కలు విదిల్చి ఎగిరిపోయినట్టనిపించింది.

ఎవరిదారిన వాళ్ల రెక్కలొచ్చి తలా ఒక మూలకి ఎగిరిపోయాక బోసిపోయిన ఆ గూట్లో భర్తతో మిగిలిపోయిన రుక్మిణికి జీవితం శూన్యంగా అన్పించింది.

పాతికేళ్ళు పిల్లల అలనాపాలనలో వాళ్ల అల్లరి, కోపతాపాలూ, అలకలూ, చదువులూ వీటి మధ్య క్షణం తీరికలేకుండా గడిపింది. కాలం ఎలా గడిచిందో తెలికుండానే జీవితంలో సగభాగం గడిచిపోయింది.

చంద్రశేఖర్ ఇంటిపట్టున చాలా తక్కువ సమయం గడుపుతుంటాడు. అతనికి ఆఫీసు, క్లబ్బు చాలా ఇష్టమైన స్థలాలు. దాదాపు ఇంటిబాధ్యత, పిల్లల బాధ్యత రుక్మిణే చూసుకుంది. అడిగినంత డబ్బివ్వడం తప్ప మరే విషయం పట్టించుకోలెదతను.

రుక్మిణి పెళ్ళైన దగ్గర్నించీ ఒక నిజాయితీపరుడైన ఉద్యోగిలా గృహిణి అన్న తన ఉద్యోగాన్ని అంకితభావంతో చేస్తోంది. ఆ అంకిత భావం అప్పుడూ ఇప్పుడూ అలాగే ఉంది. కానీ అప్పుడప్పుడు ఆవిడకి తను చాలా ఒంటరిదాన్నై పోయానన్న భావం కలుగుతుంటుంది. అప్పుడు మాత్రం భర్త మీద విరుచుకుపడాలనిపిస్తుంది. కానీ అన్నివిధాలా పూర్తిగా తనమీద ఆధారపడి బతుకుతున్న అతడిని ఏమీ అనలేని నిస్సహాయురాలు. ఆవిడకి ఆనందాన్నిచ్చేవి భర్తకి, పిల్లలకి చేసే సేవలేనేమో అనిపిస్తుంది చూసేవారికి. ఆమె ప్రపంచం వాళ్ళ చుట్టూ అల్లుకుపోయింది సాలెగుడులా.

రుక్మిణి ఆనందానికి ఇంక హద్దేముంటుంది!

క్యాలెండర్ తీసి చూసింది. ఇంకా నాలుగురోజులుంది దీపావళి పండక్కి.

అమ్మో! బోలెడు పనుంది. ఇంట్లో బూజుదులపాలి, కడగాలి, పిండివంటలు చేయాలి. బజారుకెళ్ళి కొత్త బట్టలు, టపాకాయలు తేవాలి. ఈ మహానుభావుడు ఎన్నింటికొస్తారో!

కొంతసేపటికిగానీ ఆవిడలో కలిగిన అలజడి తగ్గలేదు. ఏ పని ఎక్కడ ప్రారంభించాలో తెలియక కాస్సేపు దిక్కులు చూసింది. పనిమనిషియాదమ్మ మూడు గంటలకి వచ్చింది. అప్పుడు ఏంపని ముందు చేయాలో ఆవిడకి అర్థమైంది.

'' ఇంట్లో బూజు దులుపుదాం సాయంచేస్తావా యాదమ్మా! పిల్లలు పండక్కి వస్తున్నారు'' అన్నది సంతోషం ప్రతిఫలిస్తోన్న మొహంతో.

''మంచిదమ్మా ఎప్పుడొస్తున్రు?'' అడిగింది యాదమ్మ

''వచ్చేస్తారే. రేపో ఎల్లుండో వస్తారు చాలా పని ఉంది'' అంది హడావుడి పడిపోతూ.

అమ్మగారి హడావుడి, ఆనందం అబ్బురంగా చూసింది యాదమ్మ.

రుక్మిణి ఓ గంటలో ఇల్లంతా బూజులు దులిపించి శుభ్రంగా కడిగించేసింది.

తను వంట గదిలోకి వెళ్ళి చేయవలసిన పిండివంటలు, చట్నీ పొడులు వగైరాలకు కావలసిన సరుకులు సరిపడా డబ్బాల్లో ఉన్నాయో, లేదో చూసి లేనివన్నీ ఓ లిస్టు తయారుచేసింది.

చంద్రశేఖర్ కోసం క్షణమో యుగంగా ఎదురుచూస్తూ కూర్చుంది.

ఎనిమిది గంటలకి ఇల్లు చేరిన చంద్రశేఖర్ చాలాకాలం తరువాత భార్య మొహంలో వెల్లివిరుస్తున్న సంతోషం చూసి ఆశ్చర్యపోయాడు. అతని ఆశ్చర్యాన్ని ద్విగుణీకృతం చేస్తూ రుక్మిణి ''వచ్చారా! మీకోసమే ఎదురుచూస్తున్నాను'' అంది.

బోల్డు ఆశ్చర్యపడి ''నాకోసమా, ఎందుకు?'' అడిగాడు.

రుక్మిణి చిరుకోపంతో అంది. '' ఏమిటా ప్రశ్న మీకోసం కాక ఇంకెవరికోసం ఎదురుచూడాలి?''

''అదికాదు... నువ్వెప్పుడూ నాకోసం ఇంతగా ఎదురుచూడలేదుగా పిల్లలు పెద్దవాళ్ళైన దగ్గర్నించీ''

''సరేలేండి, అదంతా ఎందుక్కానీ నాకు డబ్బుకావాలి'' అంది.

'' ఎంత కావాలి? ఎందుక్కావాలి? ఎప్పుడు కావాలి?''

రుక్మిణి నవ్వింది.

టి.వి. మీద పెట్టిన మూడు కవర్లు తీసి అతని చేతికందిస్తూ '' ఎందుకు? అన్నదానికి జవాబు ఈ ఉత్తరాలు. ఇహ ఎంత అంటే నాకే తేలీదు. ఎంత అవుతుందో! ఎప్పుడు అంటే రేపు ఉదయానికి అని చెప్పగలను''.

భార్య మాటల్లోని చలాకీతనం అతణ్ణి ఎంతో ఆకర్షించింది. ఎంతోకాలమైంది రుక్మిణిని ఇలా చూసి'' అనుకున్నాడు.

కవర్లలోపల ఉన్న కాగితాలు చదివిన అతని మొహంలో ఆనందం విరిసింది.

'' ఇదా సంగతి, అర్థమైంది నీ సంతోషం దేనికో'' అంటూ చేతివాచీలో తేదీ చూశాడు.

''అరే... నాలుగురోజులే ఉంది పండక్కి. రేపో ఎల్లుండో వచ్చేస్తారు వీళ్ళు'' అన్నాడు.

''అందుకే పిల్లలకు బట్టలు కొనాలి. టపాకాయలు కొనాలి, డబ్బు కావాలి.''

''పిల్లలు చిన్నపిల్లలా టపాకాయలు కాల్చుకోడానికి.. అయినా ముగ్గురూ అనుకున్నట్లు ఒకసారే రావడం తమాషాగా ఉందే''

''సురేఖకి చిన్నప్పట్నించీ చిచ్చుబుడ్లు, కాకరపువ్వొత్తులూ కాల్చడం సరదా. పవన్‌కి బాంబులిష్టం, తీసుకొస్తానండీ, సరదాగా కాల్చుకుంటారు''.

''సరదా నీకా... వాళ్ళకా?''

'' ఎవరికో ఒకళ్ళకి లెద్దు.'' అంది.

''సరేలే... బ్లాంక్ చెక్ ఇస్తాను, నీక్కావాల్సినంత డ్రా చేసుకో'' అంటూ బాత్‌రూమ్ లోకి వెళ్ళిపోయాడు.

మరునాడు భర్త ఆఫీస్‌కెళ్ళిపోగానే యాదమ్మని తీసుకుని బజారుకెళ్ళింది రుక్మిణి.

కూతురుకీ, కోడళ్ళకీ చీరలు, మగపిల్లలిద్దరికీ, అల్లుడికీ ప్యాంట్ షర్ట్‌లు, టపాకాయలు మొదలైనవి కొని ఇల్లుచేరేటప్పటికి ఎనిమిదైంది.

తెచ్చిన ప్యాకెట్లు బీరువాలో సర్దుతోన్న రుక్మిణితో హఠాత్తుగా అంది యాదమ్మ.

''అమ్మా! అందరికీ కొత్త బట్టలు కొన్నావు... మల్ల నీకేవి. యాది మర్సినవా?''

రుక్మిణి ఓ క్షణం ''అయ్యో!'' అనుకుని తేలిగ్గా అన్నది, ''నాకెందుకే చిన్నపిల్లనా పండక్కి కొత్తబట్టలు కట్టుకోడానికి''

''మరి సార్‌కి తీసుకున్నవు కదమ్మా''

''బాగుందే... నేను గుర్తుంచుకొని కొనకపోతే అయనకి ఇంకెవరు కొంటారు? సరేలేగానీ. ఇంద ఈ రెండొందలు తీసుకొని నీకు ఏం కావాలంటే అది కొనుక్కో'' పర్స్‌లోంచి రెండొందలు తీసిచ్చింది.

యాదమ్మ రెండు చేతుల్లో ప్రసాదం అందుకున్నంత భక్తిగా అందుకుంది.

రుక్మిణి ఎక్కువ ఎదురు చూడాల్సిన అవసరం లేకుండానే ఒకళ్ళ తరువాత ఒకళ్ళుగా పిల్లలు ముగ్గురూ వారివారి భాగస్వాములతో దిగారు.

ఇల్లంతా సందడితో నిండిపోయింది. చంద్రశేఖర్ లీవ్ పెట్టేశాడు. బాంబే నుంచి చరణ్ తండ్రికోసం మంచి ఫారెన్ సిగరెట్స్ తెచ్చిచ్చాడు.

పవన్ హ్యాండ్‌స్టిక్ తెచ్చాడు. సురేఖ యాష్‌ట్రే తెచ్చిచ్చింది. రుక్మిణికి

చీర కూడా తెచ్చింది. బాగా ముదురు రంగులో ఉన్న సిల్కుచీర. అది చూసి నవ్వుకుంది రుక్మిణి ''సిల్కుచీర తనెలా కట్టుకుంటుంది! సురేఖకి బొత్తిగా తెలీదు. కట్టుకోకపోతే బాధపడుతుంది. తనకి సిల్కుచీరలంటే ఇష్టంలేదని పాపం దానికి తెలీదు కదా!'' అనుకుని చీర తీసి దాచిపెట్టింది.

''నీకోసం ఏం తేవాలో తెలీలేదమ్మా'' అన్నాడు చరణ్.

''అవునులేరా. నేను ముసలాణ్ణి అవుతున్నానని, నడవలేనని ఊతంగా నాకీ హ్యాండ్ స్టిక్ తెచ్చారు. మీ అమ్మ ముసల్ది కావడం లేదా?'' కినుకగా అన్నాడు చంద్రశేఖర్.

''అమ్మకి ఎప్పటికీ నువ్వే ఊతం నాన్నా! ప్రత్యేకంగా ఏం కావాలి?''

ఆ మాటలకి రుక్మిణి భర్తవైపు చూసి నవ్వింది.

''సరేలే, అందరూ పదండి భోజనాలు వడ్డిస్తున్నాను'' అంది లేస్తూ.

'' ఏం చేశావమ్మా వంటలు'' అడిగాడు పవన్ ఆవిడ వెనకాలే నడుస్తూ.

''నీకిష్టమైన కాకరకాయ కారం, అన్నయ్య కోసం కందిపచ్చడి, సురేఖ కిష్టమైన సాంబారు''

''మరి నాగతి అధోగతేనా. నీ పిల్లలొచ్చిన శుభసందర్భంలో'' జాలిగా అడిగాడు శేఖర్.

''మీ కిష్టమైన రసం, గడ్డపెరుగు, అవకాయ మామూలేగా'' అంది రుక్మిణి డైనింగ్ టేబిల్ మీద కంచాలు సర్దుతూ.

కబుర్లతో, నవ్వులతో గడిచిపోయింది ఆరోజంతా.

మర్నాడు నరకచతుర్దశి.

రుక్మిణి తెల్లవారురుఝామున నాలుగింటికే లేచి స్నానంచేసి దీపాలు వెలిగించింది. బలవంతంగా సురేఖనీ, కోడళ్ళనీ లేపింది.

''నిద్రొస్తోందత్తయ్యా'' గారంగా అన్నారు కోడళ్ళు.

''సరదాగా పండక్కి వచ్చి నిద్రేవిటమ్మా, తలంటుకోండి. మీ ఊరెళ్ళి పడుకుందురుగానిలే'' సున్నితంగా మందలించింది.

రకరకాల పిండివంటలతో, ఘుమఘుమలాడే వంటకాలతో, టపాకాయల మోతలతో ఇల్లంతా తిరణాలలా ఉంది.

తల్లి ఇచ్చిన చీర చూసి మురిసిపోయింది సురేఖ.

''ఈ కలర్‌కోసం నేను తిరగని షాపు లేదు. నీకెక్కడ దొరికిందమ్మా'' అంది.

''బ్యూటిఫుల్ శారీ అత్తయ్యా. ఎంత బాగుందో!'' మిలమిల మెరిసే కళ్ళతో మెచ్చుకుంది చిన్నకోడలు.

''చాలా బాగుందత్తయ్యా మీ సెలక్షన్. నాకీ అంచు నప్పుతుందని భలే ఊహించారే'' సంబరపడింది పెద్దకోడలు.

''అత్తయ్యా మీకు ఆడవాళ్ళ చీరల సంగతే అనుకున్నా. మాక్కావలిసిన సూట్‌లు సెలక్ట్ చేయడం ఇంత బాగా వచ్చా?'' ఆశ్చర్యంగా చూశాడు అల్లుడు.

''చిన్నప్పట్నించీ మాకిష్టమైనవేవో అమ్మే తెస్తుండేది బావగారూ మొన్నటిదాకా'' అన్నాడు పవన్.

చంద్రశేఖర్ తనకోసం తెచ్చిన జరీ అంచుధోవతి కట్టుకుని ''అచ్చు రావుగోపాలరావులా ఉన్నానా?'' అన్నాడు.

కొంచెం కొత్తదనిపించే చీర కట్టుకున్న రుక్మిణి చీర గురించి ఎవరూ పట్టించుకోలేదు.

దీపావళి కేవలం ఆ ఇంటికోసమే వచ్చిందా అన్నంత ఆర్భాటంగా జరిగిపోయింది.

పండగ వెళ్ళిన మూడోరోజే ముగ్గురూ వారివారి కుటుంబాలతో బయల్దేరారు. పవన్‌కి కావలిసిన రవ్వలడ్లు, కోడళ్ళకి కావలసిన ఊరగాయలు, పచ్చళ్ళు, అప్పడాలు, వడియాలు, అల్లుడికి కావలిసిన పచ్చళ్ళు, కందిపొడి, చట్నీపొడి, సురేఖ కిష్టమైన అరిశెలు, చరణ్ కిష్టమైన లడ్లు, అవికాక జంతికలు అన్నీ విడివిడిగా సర్ది ఎవరివి వాళ్ళకిచ్చింది రుక్మిణి.

కన్నీళ్ళు నిండిన కళ్ళతో నిల్చున్న రుక్మిణిని చూసి ''బాధపడకమ్మా

మాదగ్గరికి వచ్చేయి'' అంది సురేఖ.

''కాదత్తయ్యా మా దగ్గరికి రండి. ఆఫీస్ హడావుడికి, వంట చేసుకుని తినేటైమే ఉండటంలేదు. మీ కమ్మటిచేత్తో వండిపెడుదురుగాని'' అంది చిన్నకోడలు.

''పెద్దకోడలూ, కొడుకూ ఉండగా వాళ్ళ దగ్గరుండటం భావ్యం కాదత్తయ్యా మాదగ్గరికి రండి, నాలుగు రోజులుందురుగాని'' అన్నది పెద్దకోడలు...

కన్నీళ్ళ మధ్య నవ్వి అంది రుక్మిణి '' ఆయన రిటైర్ అయ్యాక అందరి దగ్గరికీ వంతులవారీగా వస్తాంలే ... దెబ్బలాడుకోకండి''.

''కరెక్ట్ నాన్నగారూ! రిటైర్ అవగానే మీ ఇద్దరూ వచ్చేయండి'' అన్నాడు చరణ్. ''సరేలే... పదండి ట్రైన్ టైమవుతోంది'' అన్నాడు చంద్రశేఖర్.

అందరూ తల్లిదగ్గర సెలవు తీసుకుని గంటతేడాగా ఒక్కొక్కళ్ళే వెళ్ళిపోయారు. అందర్నీ స్టేషన్‌కెళ్ళి రైలెక్కించి వచ్చాడు చంద్రశేఖర్.

మళ్ళీ తనకు తోడుగా మిగిలిన నిశ్శబ్దాన్ని చూసి నిట్టూర్చింది రుక్మిణి.

పిల్లల ఉత్తరాలతో కలిగిన చైతన్యం, ఉత్సాహం, వాళ్ళతోటే వెళ్ళిపోయినట్టు నిస్సత్తువగా మారిపోయింది.

మామూలు దినచర్య మొదలైంది.

క్షణం తీరికలేకుండా... గడిచిన వారం రోజుల నీరసంతోపాటే... తిరిగి అనారోగ్యం అవిణ్ణి ఆవరించింది.

యాంత్రికంగా రోజులు గడిచిపోతున్నాయి. క్షేమంగా చేరినట్టు ముగ్గురి దగ్గర్నించీ ఉత్తరాలు వచ్చాయి.

భార్యలో కనిపిస్తున్న ఉదాసీనతని చూసి హాస్యంగా అన్నాడు చంద్రశేఖర్ ''నీ పిల్లలు ఎప్పటికీ నీ రెక్కల చాటున ఉంటారా ఏవిటోయ్... అంత బెంగపెట్టుకుంటావేం?''

''బావురుమంటోన్న ఈ ఇంట్లో మనిద్దరమే ఉండి ఏంచేస్తాం... మీరు

రిటైర్ అయ్యాక చరణ్ దగ్గరికి వెళ్ళిపోదామండీ...''

''అలాగే! నేను కాదన్నానా''

భర్త సమాధానం కొంత ఊరట కలిగించింది. నాలుగు నెలలు గడిచాయి.

ఆ రోజు రుక్మిణికి నిద్రలేచిన దగ్గర్నుంచీ ఒళ్ళు తూలుతున్నట్టుగా అనిపిస్తోంది. కళ్ళు మంటలుగా, తలంతా భారంగా అన్పించింది. మంచంమీంచి లేవాలనిపించలేదు. కానీ చంద్రశేఖర్‌కి వంట చేయాలి. తప్పదన్నట్టు లేచింది. ఎలాగోలా వంట చేసింది.

అదోలా కన్పిస్తోన్న భార్యని చూసి '' ఇంకా దిగులుపోలేదా?'' అనడిగాడు.

''దిగులేంకాదు. ఊరికే కొంచెం తలనొప్పిగా ఉంది''.

''సరే... నేవెళ్ళాక రెస్ట్ తీసుకో...''

అతను ఆఫీసుకెళ్ళిందాకా ఎలాగోలా గడిపి మంచంమీద వాలిపోయింది.

యాదమ్మ వచ్చాక జ్వరమని క్రోసిన్ టాబ్లెట్ తెప్పించి వేసుకుంది. సాయంకాలానికి కొంచెం తేలికగా అన్పించింది. మళ్ళీ రొటీన్‌లో పడిపోయింది.

అలా వారం రోజులు. అవసరాన్ని బట్టి క్రోసిన్ వాడుతూ గడిపేసింది.

ఆరోజు తెల్లవారి ఏడైనా భార్యలేవకపోవడం చూసి.. తట్టిలేపాడు చంద్రశేఖర్ ''రుక్మిణీ! ఇంకా పడుకున్నావేం..''

రుక్మిణి మెల్లగా కళ్ళు తెరచి నీరసంగా ''జ్వరంగా ఉందండీ'' అంది.

''టాబ్లెట్ వేసుకో నేను హోటల్ కెళ్ళి కాఫీ తెస్తాను'' అంటూ లేచి ఫ్లాస్క్ తీసుకొని బయల్దేరాడు. ఆ రోజు అతను భోజనం కూడా హోటల్లోనే తిన్నాడు. రుక్మిణి మళ్ళీ క్రోసిన్ వేసుకుంది.

యాదమ్మ క్షీణిస్తోన్న అమ్మగారి ఆరోగ్యం చూసి ''దవాఖానకు పోవద్దామ్మా! రోజూ జరం అంటున్నావు'' అంది.

'' ఈ మాత్రం దానికి ఎందుకే.. మందేసుకున్నాగా...''

'' ఏందో! మీరే డాక్టర్ లెక్క మాట్లాతుంద్రు. సార్‌కి తెలవదా తోల్కబోవద్దా!'' అని సణుగుతూ పనిచేసింది.

మరునాడు మూలుగుతూ వంటచేస్తోన్న రుక్మిణిని '' ఏందమ్మా.. నిన్నంతా జ్వరంతో ఏం తినలే.. గంత నీర్సంగ ఉండి వంట చేయకుంటే ఏమాయె..'' అంది.

''పాపం నిన్నకూడా. ఆయున హోటల్లో తినాల్సి వచ్చింది... ఆ మసాలాల వాసనలు ఆయనకసలు పడవు. ఎంతసేపు చేస్తానులే..''

'' ఏందో! ఆయనేమో నీ సంగతే పట్టించుకోకపాయె. నువ్వు ఆయనకి అదిష్టంలేదు. ఇదిష్టంలేదని.. ఫికరు పడుతున్నావు..''

రుక్మిణి మాట్లాడలేదు.

కానీ ఆకాస్త శ్రమా ఆవిడ శరీరం ఓర్చుకోలేకపోయింది.

మూసిన కన్ను తెరవకుండా పడివున్న రుక్మిణిని చంద్రశేఖర్ ఇల్లు చేరిందాకా అలాగే కనిపెట్టుకుని కూర్చుంది యాదమ్మ.

ఎనిమిదింటికి ఇల్లు చేరిన అతణ్ణి కొంచెం కోపంగా మందలించింది. '' ఏందయ్యా.. అమ్మకు వారం దినాలనుంచి పెయ్యిబాలేకపోతే దవాఖానకు తోల్కబోవా..''

'' ఏమైంది! రుక్మిణీ! రుక్మిణీ!'' కొంచెం వంగి భార్య నుదురుమీద చేయివేసి చూస్తూ పిల్చాడు.

రుక్మిణి కళ్ళు తెరచి బలహీనంగా నవ్వింది. ''ఖంగారేం లేదండీ జ్వరం అంతే..''

''టాబ్లెట్ వేసుకోలేదా?'' అడిగాడు.

ఆమాట అతను చాలాసార్లు అన్నాడు కానీ, ఏం టాబ్లెట్ వేసుకోవాలో అతను చెప్పలేదు. చిన్నప్పట్నించీ పిల్లలకి డాక్టర్లు ప్రిస్క్రైబ్ చేసిన క్రోసిన్ ఒక్కటి ఆవిడకి గుర్తుంది. అదే వేసుకుంది.

''వేసుకున్నాను'' అన్నది.

''కాఫీ తాగావా?..''

''కాఫీ ఏందయ్యా దవాఖానకు తోల్కబో..'' దబాయించింది యాదమ్మ.

'' ఇప్పుడెవరుంటారు.. ఎనిమిదన్నర అయింది. రేపు ఉదయం తీసికెళ్తాలే. నువ్వెళ్ళు'' అంటూ యాదమ్మని పంపించేశాడు.

అతను హోటల్‌కెళ్ళి భోంచేసి రుక్మిణి కోసం కాఫీ తెచ్చాడు. ఆవిడ అది తాగలేకపోయింది.

''వాంతయేలా ఉందండీ వద్దు'' అన్నది.

''సరేలే పడుకో పొద్దున్నే డాక్టర్ దగ్గరికెళదాం''.

తెల్లవారి లేచేసరికి రుక్మిణి పూర్తిగా అపస్మారక స్థితిలో పడిపోయింది. చంద్రశేఖర్‌కి కొంచెం భయం వేసింది. వెంటనే వెళ్ళి ఆటో తీసుకొచ్చి ఆవిణ్ణి దగ్గర్లో ఉన్న నర్సింగ్‌హోమ్‌కి తీసికెళ్ళాడు. అక్కడ డ్యూటీడాక్టర్ మాత్రమే ఉన్నాడు.

'' ఎన్నాళ్ళ నుంచి జ్వరం? ఒళ్ళు నొప్పులున్నాయా? టెంపరేచర్ ఎంతుంది? ఆవిడ ఆహారం ఏమి తీసుకొంది?'' లాంటి ఏ ఒక్క ప్రశ్నకీ చంద్రశేఖర్ సమాధానం చెప్పలేకపోయాడు.

''అడ్మిట్ చేయండి'' అంటూ అడ్మిట్ చేసుకున్నాడు రుక్మిణిని.

అతనికి కొంచెం భయంవేసింది. కొంచెం గిల్టీగా ఫీలయ్యాడు. ఆఫీస్‌కి సెలవు పెట్టే శాడు. మూడురోజులు దాటినా రుక్మిణి కోలుకోలేదు. ''టైఫాయిడ్'' అన్నారు డాక్టర్లు.

చంద్రశేఖర్‌కి ఏం తోచలేదు. అతని స్నేహితులు మధ్య మధ్యలో వచ్చి పలకరించి వెళుతున్నారు. ఆ రోజు మధ్యాహ్నం వెళ్ళి పిల్లలు ముగ్గురికి టెలిగ్రాంలు ఇచ్చి వచ్చాడు. వాళ్ళని చూస్తే ఆవిడ ఆరోగ్యం కుదుటపడుతుందేమో అనిపించింది.

రెండురోజుల తర్వాత రుక్మిణి ఆఖరి శ్వాస తీసుకుంది.

హతాశుడైపోయాడు చంద్రశేఖర్. పిచ్చెక్కిపోయిందతనికి

స్నేహితులూ, బంధువులూ వచ్చారు.

మర్నాటికి పిల్లలంతా వచ్చేశారు.

ఏడుపులతో, ఓదార్పులతో, పరామర్శలతో గడిచిపోతున్నాయి రోజులు.

ఇల్లంతా బావురుమంటోంది.

విషాదం అణువణువునా నిండిపోయింది.

చరణ్, పవన్ బరువైన హృదయాలతో ఆవిడకి జరిపించాల్సిన తంతు జరిపిస్తున్నారు.

ఐదారు నెలలక్రితం దీపావళి నాటి సంబరం, సరదాలు రుక్మిణి చేసిన ఆర్భాటం గుర్తొచ్చి అందర్నీ కలచివేస్తోంది.

సురేఖ కుమిలి కుమిలి ఏడుస్తోంది.

కోడళ్ళిద్దరూ తమకు అనుభవంలోకి రాని అనేక ఆచారాలను విధిగా పాటిస్తూ మనసులోనే కుమిలిపోతున్నారు. వాళ్ళకి రుక్మిణి అప్యాయత తల్లిని మరిపించేది.

ఆ రోజు పదోరోజు.

సాయంకాలానికి బ్రాహ్మణుడు వచ్చి పదకొండు, పన్నెండు రోజుల కర్మకాండ గురించి వివరిస్తున్నాడు. ''పన్నెండోరోజు పెద్దకర్మ చేయాలి. రుక్మిణికి ఇష్టమైన వంటలు, పిండివంటలు చేసి సంతర్పణ చేయాలి. ఆవిడ ఆత్మ శాంతిస్తుంది. బంధువులనూ, స్నేహితులనూ, కావల్సిన వాళ్ళందర్నీ భోజనాలకి పిలవాలి'' అని చెప్పాడాయన.

చరణ్, పవన్ కూర్చుని పిలవవలసిన వాళ్ళ లిస్ట్ తయారుచేస్తున్నారు. కోడళ్ళిద్దరూ వంటలు ఏం చేయాలో మాట్లాడుకుంటున్నారు.

''అత్తయ్యగారి కిష్టమైన వంటలు చేయాల్ట ఆవిడకేదిష్టమో'' అన్నది పెద్ద కోడలు.

'' ఏమో అక్కయ్యా! ఏవండీ మీ అమ్మగారికి ఏం వంటలిష్టం'' భర్తని అడిగింది చిన్న కోడలు.

''అమ్మకేమిష్టం? ఏమో'' ఆలోచిస్తూ అన్నాడు పవన్.

'' ఏవండీ బావగారూ! మీకు తెలుసా మీఅమ్మగారికి ఏం ఇష్టం?''.

''అమ్మకా? ఏమో.. నాకు తెలీదే.. సురేఖని అడుగు'' అన్నాడు చరణ్.

''సురేఖా.. మీ అమ్మగారికేమిష్టమో తెలుసా?''

సురేఖ పేలవంగా నవ్వింది. ''తేలీదు వదినా''.

''బాగుంది'' అని మాత్రం అని ఊరుకుంది చిన్నకోడలు.

''అత్తయ్యగారితో ముప్పై ఏళ్ళకు పైగా కాపురం చేశారు మావయ్యగారు, ఆయనకి తెలుసేమో!''.

పెద్దకోడలు పడుకుని ఉన్న చంద్రశేఖర్ దగ్గరికెళ్ళి అడిగింది ''మావయ్యగారూ! అత్తయ్యగారికిష్టమైన వంటలు చేయాల్ట అవేవో మీకు తెలుసా!''

అతను మాట్లాడలేదు. కొన్ని క్షణాలాగి అన్నాడు. ''నా ఇష్టాలు గమనించి వేళకన్నీ అమర్చిపెట్టేది. ఆవిడ ఇష్టం గురించి నేనెప్పుడూ అడగలేదమ్మా. ఆవిణ్ణి చిన్నప్పట్నించీ పెంచి పెద్ద చేసింది వాళ్ళ పెద్దవదిన, ఆవిణ్ణి అడుగు'' అన్నాడు.

రుక్మిణి వదినగారైన పాపాయమ్మ గారి దగ్గరికి వెళ్ళింది.

''పధ్నాలుగేళ్ళ పిల్లకి పెళ్లిచేసి పంపించాం. ఆ తరువాత ఆవిడ వచ్చి పట్టుమని పదిరోజులు నా దగ్గర ఉండేదా, నాకు గుర్తులేదమ్మా, ఏదో ఒకటి చేయండి'' అన్న దావిడ.

పెద్దకోడలు నిట్టూర్చింది.

''మీ పిన్నత్తగారికి తెలుసేమో అడుగు పోనీ''.

పెద్దకోడలు పిన్నత్తగారి దగ్గరికెళ్ళింది.

''అత్తయ్యగారూ! మా అత్తగార్కి ఏం ఇష్టమో మీకేమైనా తెలుసా?'' వినయంగా అడిగింది.

ఆవిడ ఓ క్షణం ఆలోచించి అన్నది.

''పెళ్ళి కాకముందు ఏవో ఇష్టాలుండేవి. పెళ్ళయ్యాక భర్త ఇష్టం తన ఇష్టంగా, పిల్లలు పుట్టాక వాళ్ళ ఇష్టాలే తన ఆనందంగా బతికింది. ఆవిడ పిల్లలకి ఏదిష్టమో అదే చేయించండమ్మా.. చాలు''.

రుక్మిణికి ఏం ఇష్టమో తెలీకుండానే పన్నెండోరోజు సంతర్పణ జరిగిపోయింది.

బంధువులంతా వచ్చారు.

''చాలా అదృష్టవంతురాలు.. ముత్తైదువుగా వెళ్ళిపోయింది.'' అన్నారు.
''పిల్లల చేతుల్లో కన్నుమూసింది పుణ్యాత్మురాలు'' అన్నారు.

రుక్మిణి ఆత్మ శాంతించిందో! లేదో!

''విపుల''

ఫిబ్రవరి 98